# అఖండదృష్టి

నేను పుట్టాను.

నన్ను కన్నవారి కలలు నెరవేరాయి. వారి ఆనందం వర్ణనాతీతం.

అభినందనల వర్షంలో మునిగిపోయారు వారు.

వారిని కన్నవారి పేరు ప్రఖ్యాతులు దశదిశలా మారుమ్రోగాయి.

అంతా గమనిస్తూనే ఉన్నాను.

నా జాతకం వారికి తెలియదా? నేనెందుకు పుట్టానో వారి ఊహకు అందదా?

ఏమిటీ సంబరం! ఏమిటీ ఉల్లాసం!

ఎందుకీ అభినందనలు!

చిన్నబాబు! అదీ నాకు వాళ్ల పెట్టిన పేరు.

పేరుకి చిన్నబాబునే! ఆకారానికి మాత్రం కాదు.

నన్నాహ్వానించే యీ లోకాన్ని అర్థంచేసుకోవాలి. నా గురించి వినాలి అని బయటకు బయల్దేరాను.

ముందుగా నాకెదురయినవాడు కాపలాదారుడు. నా ఆకారాన్ని చూసి భయపడతాడనుకున్నాను.

"ఎక్కడికి?" అన్నాడు భీకరంగా.

"నేనెవరో తెలుసా?" బింకంగా అన్నాను.

"చిన్నబాబువి. నువ్వంటే నాకు ఎంతో ముద్దు. నీకు కాపలా కాయడం నా జన్మకు మహద్భాగ్యం" చెపుతూనే వున్నాడు.

వీడికి నేనేం చేయగలనో తెలియదేమో! అందుకే అలా పొంగిపోతున్నాడు, వింటూ

అనుకున్నాను.

"నాకో చిన్న కోరిక ఉంది" అన్నాను ప్రాధేయపూర్వకంగా.

"ఏమిటిది?" అన్నాడు.

నేను పుట్టిన ప్రపంచాన్ని చూడాలి. నేను భస్మీపటలం చేయబోయే ప్రపంచాన్ని చూడాలి– అందామనుకున్నాను.

"ఒక గంట అలా తిరిగి వస్తాను" అన్నాను.

"ఏముంది చూడటానికి? నన్ను చూస్తే చాలదా?"

తెల్లబోయాను.

"ప్రతీయింటి చుట్టూ ఫెన్సింగులుంటాయి. కుక్కలు ఉంటాయి. ప్రతి భవంతి చుట్టూ గోడలుంటాయి. కాపలావాళ్లు ఉంటారు. ప్రతి దేశం చుట్టూ సైన్యాలుంటాయి. పహారా లుంటాయి. లోపలి వాళ్లను బయటకి పోనియ్యం. బయట వాళ్లని లోపలికి రానియ్యం. నన్ను చూస్తే యీ ప్రపంచమంతా చూసినట్లే!" అన్నాడు.

"నిజమే అయుంటుందిగానీ, అదేంటది?" ఎక్కడినుంచో ఏదో శబ్దం వినిపిస్తోంది. అది నిరంతరంగా వినవస్తూనే వుంది.

"అదా!– అది సముద్రం" అన్నాడు.

"అంటే?"

"అదీ, అదీ!" అని నవ్వేసి "అది కూడా నాలాంటిదే! నేలకి కాపలా కాస్తోంది. హారా హుషార్! అంటోంది" అన్నాడు.

"నేనది చూడాలి"

"ఏం చూస్తావూ! అదిగో పైన ఆకాశం లేదూ! అలాగే నీలంగా ఉంటుంది. అయినా నిన్నూ పైకి తీసుకెళ్తారుగదా! అప్పుడంతా నీకే బాగా కనిపిస్తుంది.

"నన్ను పైకి తీసుకెళ్తారు, నీకెలాంటి సందేహమూ లేదు" అన్నాను.

"అవును చిన్నబాబూ! ఎలాంటి సందేహమూలేదు"

సన్నగా నిట్టూర్చాను. బలవంతంగా గొంతు సవరించుకున్నాను.

"అందాకా ఆగలేను... ఒక్కమారు చూసివస్తాను" బ్రతిమాలాను.

సరేనన్నాడు, దోవ అడిగాను.

"ఇటువెళ్లు! నీకు ముందుగా స్టాఫ్ క్వార్టర్సు కనిపిస్తాయి. అది దాటాక పెద్దపెద్ద ఆఫీసర్లూ, సైంటిస్టులూ ఉండే భవనాలు కనిపిస్తాయి. అది దాటాక ఉంటుంది సముద్రం"

గేట్లు తీశాడు... బయలుదేరాను.

• • •

రాత్రి తొమ్మిదవుతోంది. చాలా దూరం నిర్జనంగా ఉంది. వేగంగా కదిలాను. దీపాల కాంతి దూరానికి ఒకే మంట వెలుతురులా కనిపిస్తోంది. బస్తీ దగ్గరవుతున్న కొద్దీ శూన్యంలో వేలాడదీసిన దీపాల హారాల్లా అనిపించింది. క్రమంగా పేర్చినట్టున్న కాంక్రీటు భవనాలు కనిపించసాగాయి. బార్లు, రెస్టారెంటులు, థియేటర్లు, ఎమ్యూజ్‌మెంటు పార్కుల చుట్టూ బెల్లం చుట్టూ ఈగల్లా వాహనాలు, జనం! ఇళ్లలో కొందరు టీవీలకు అతుక్కుపోయి వున్నారు. వీధివయిపూ, యిళ్లవెనకా, రోడ్ల కూడలిలోనూ కొంతమంది వృద్ధులు కూర్చుని మారిపోతున్న ప్రపంచాన్ని తిట్టుకుంటున్నారు. అవే స్థలాలలో కాస్తంత చాటుగా కూర్చున్న పడుచు జంటలు మారని ప్రపంచాన్ని ఆడిపోసుకుంటున్నారు.

ఎవరూ వీధుల్లో ఖాళీగా కనిపించలేదు.

నేను క్వార్టర్సు దాటాను. విశాలమయిన ఆ బాటలోనే మరికొంత దూరం సాగాను. రోడ్డుపక్కగా ఓ కారు కనిపించింది. ఏక్సిడెంటేమో! అటు కదిలాను. కారు లోపలికి చూశాను.

ఒక వ్యక్తి డ్రైవరు స్థానంలో కూర్చునున్నాడు. అతను రెండు చేతులూ చక్రం మీద పెట్టి దానిమీద తల ఆన్చుకున్నాడు.

అతని చుట్టూ ఎక్కడా రక్తపు జాడలులేవు. అతను కదుల్తున్నాడు.

లేపాను. చటుక్కున తల ఎత్తాడు.

ప్రపంచం అతన్ని పట్టించుకోనందువల్లనో, ప్రపంచాన్ని అతను పట్టించుకున్నందువల్లనో యిదమిద్ధంగా తెలియకపోయినా అతని చూపులు చాలా తెగింపుతో ఉన్నాయి.

"నువ్వా?" అన్నాడు తల ఆడిస్తూ.

"గుర్తుపట్టావన్నమాట!"

"నిన్ను ఆమూలాగ్రం పరిశీలించిన మనిషిని నేను. నీ లక్ష్యసాధన పూర్తిగా నా మీద ఆధారపడి వుంది చిన్నబాబూ!"

అతను నాకు అంతటి ముఖ్యమయిన వాడన్నమాట.

"నా కోసం అహోరాత్రాలు కష్టపడిన వాళ్లలో నువ్వు ఒకడివన్న మాట! ఏం అలా వున్నావూ?"

"ఒకతన్ని చంపాలి నేను. తప్పదు." అతను అంటున్న తీరుని బట్టి అతనా నిర్ణయానికి వెనకా ముందూ అవుతున్నట్లు తెలిసిపోతోంది.

"బాధగా ఉందా?"

"భయంగా ఉంది. పోలీసులకి దొరికిపోతానేమోనని– వాడు యింకొంచెం సేపట్లో

యిటే వస్తాడు. ఏం జరిగినా సరే వాడిని యీరోజు ఫినిష్ చెయ్యాలి."

"ఎవడు వాడు?"

"మా సూపర్‌వైజర్"

"ఏం చేశాడూ?"

"వాడేం చెయ్యలేదు. చేసిందంతా నేను. రాత్రీ పగలు అనకుండా పనిచేశాను. నా పనికి రివార్డు కావాలి. గుర్తింపు కావాలి. అధమపక్షం ప్రమోషన్ కావాలి. చిట్టచివరికి కాష్ అవార్డు దొరికినా సరిపెట్టుకునేవాడిని. ప్రశంసాపత్రం ఒకరికి, ప్రమోషన్ ఒకరికి, కాష్ అవార్డు ఒకరికి! నా పేరు ఎందులోనూ లేదు. వాడు అడ్డుపడ్డాడు. నాకేదీ దొరకలేదు."

"అందరికీ దొరికిందా?"

"ఇంకా చాలామందికి దొరకలేదు"

"అంతా నీలాగే డెస్పరేట్‌గా ఉన్నారా?"

"నాలా ఎవడూ పనిచెయ్యలేదు కనక నాలా ఎవరూ బాధపడటం లేదు. వాళ్లంతా వాళ్ల సూపర్‌వైజర్లని యింకా మెప్పించాలనుకుంటున్నారు. ఇంకా యింకా శ్రమించాలనుకుంటున్నారు."

"శ్రమించి...?"

"నీకు తమ్ముళ్లని..." అంటూ ఆగి చెవులు రిక్కించాడు.

"నేను చాలనా?" అన్నాను అతని ఏకాగ్రతను భగ్నంచేస్తూ. అతను నా వయిపయినా చూడకుండా చికాకుగా సమాధానమిచ్చాడు.

"నువ్వెక్కడ సరిపోతావూ?"

"నీ సూపర్‌వైజర్ని చంపటానికయినా సరిపోనా!"

అంతలాంటి పరిస్థితిలోనూ అతను ఫక్కున నవ్వాడు.

"అంత చిన్న పనికి నువ్వెందుకూ! నీ అవసరం ఈ లోకానికి చాలా వుంది. నీలాంటి చిన్నబాబులకి చెప్పలేనంత గిరాకీ ఉంది. నీ గొప్పంతా నువ్వే ప్రథమం కావటం."

నేను నివ్వెరపోయాను.

నాలాంటివాళ్లు యింకా యింకా పుడతారన్నమాట!

"కరెక్ట్! మా సూపర్‌వైజర్ కారే అది" అతను తన కారు స్టార్ట్ చేసి గేరు మార్చి రహదారికి ఎక్కాడు.

జరగబోయే దానిని చూడలేక ముందుకి కదిలాను.

ఆ విశాలమయిన బాటమీద ప్రయాణం చాలా హాయిగా ఉంది. రోడ్డుకి యిరుపక్కలా

చెట్లు దట్టంగా ఉన్నాయి. ఒకప్పుడు యిలా చెట్లు పెంచి ఎవరికీ కనబడకుండా ఉండేవారట. రోజులు మారాయి. ఎక్కడ ఉన్నా ఏం చేస్తున్నదీ ఎక్కడినుంచో చూసేయవచ్చుట.

క్రమంగా విశాలమైన భవనాల సముదాయం కనిపిస్తోంది. భవనాలన్నీ విశాలమైన జాగాల్లో ఉన్నాయి. అక్కడ అంతస్తులు లేవు. ప్రతీ యింటికి కట్టుదిట్టాలున్నాయి.

నేను చాలా పెద్దదయిన ఓ ప్రాంగణంలో జొరబడ్డాను. అంత ఖాళీ స్థలమున్నా భవనంలో అక్కడక్కడా వృక్షాలువున్నాయి.

పడక గదులు చాలా ఉన్నట్లున్నాయి. అందులో ఓ గది కిటికీని సమీపించాను. చెరువులంత కిటికీలు, పల్చని తెరలు గాలికి కదులుతున్నాయి. గదిలో కనబడిన దీపాల కాంతి పట్టపగల్లా ఉంది. విశాలమైన పరుపు ఆ గది వైశాల్యానికి శీర్షికలాగుంది.

ఆ పరుపుమీద యిద్దరు స్త్రీ పురుషులున్నారు.

"నా మాట వినకపోతే" అంటోంది ఆమె.

"ఏం చేస్తావు?" అన్నాడు.

"బట్టలు తొడిగేసుకుంటాను."

"ఫరవాలేదు! అవి నాకు అడ్డంకావు"

"నీవు ఉత్తి మొద్దబ్బాయివనుకున్నాను"

"అందరూ నీ మొగుడిలాగే ఉంటారా?"

"అతన్ని తక్కువ అంచనా వెయ్యకు! అతనికి కావల్సింది పరిశోధన, ప్రయోగం. మరి నీకో...?" అంది రెచ్చగొడుతున్నట్లు.

అతను మాటలతో జవాబివ్వలేదు

"వివరాలు. నెక్స్ట్ ప్రాజెక్టు వివరాలు కావాలి" అంది ఆమె అతని చేతుల్లో వివశు రాలవుతూనే.

"తప్పకుండా..." అంటున్నాడతను.

నేను అక్కడినుంచి కదిలాను. ఆ గది తర్వాత కొంత దూరంలో ఓ విశాలమైన కట్టడం ఉంది. ఆ కట్టడానికి చుట్టూ చాలా ఏర్పాట్లున్నాయి. లోపల ఓ వ్యక్తి ఉన్నాడు. ఆ గదినిండా అనేక పరికరాలున్నాయి.

ఆ వ్యక్తి సన్నగా రివటలా ఉన్నాడు. ముక్కు ఎవరో ముందుకి లాగి వదిలినట్టుంది. అతని చూపులు దేనినో పట్టుకు తీరాలన్న దీక్షలో వున్నాయి. ఈ ప్రపంచంలో ప్రతీ సృష్టి వెనకా వున్న మానవుని ఏకాగ్రతకు అతను ప్రతీకలా వున్నాడు. ఆ దీక్ష, ఏకాగ్రత అతనికొక ఋషిత్వాన్ని కల్పిస్తున్నాయి. చూడగానే గౌరవించాలన్న భావన కలిగిస్తున్నాడు.

పలకరించాను.

"హలో చిన్నబాబూ" అన్నాడు తన కంప్యూటర్‌ని ఆఫ్ చేస్తూ.

నేను మాట్లాడలేదు.

"నేను పెదబాబు కోసం కలలు కంటున్నాను" తనే అన్నాడు.

"నీ భార్య నీ పడకగదిలో ఏం కలలు కంటున్నదో తెలుసా?"

"నా అసిస్టెంటుతో ఉందా?"

"నీకు తెలుసన్నమాట" ఆశ్చర్యంతో అన్నాను.

"ఎందుకా సెంటిమెంటు? అది ఓ జీవిత వాస్తవం."

"నువ్వదాన్ని అంగీకరిస్తున్నావన్నమాట!"

"పట్టించుకోవడంలేదు అంతే!"

"ఆమె కోరికలు తీరని మనిషేం కాదు. నీ భవిష్యత్ప్రణాళికను తెలుసుకోవటానికి నీ అసిస్టెంటుని లోబరుచుకుంది!"

"ఆమెతో ఎలా వ్యవహరించాలో అతనికి పూర్తిగా తెలుసు"

ఏం అనాలో నాకు తోచలేదు.

"నేను చేస్తున్నపని అలాంటిది. నా విలువ అలాంటిది" అతను గర్వంగా అంటున్నాడని అర్థమవుతోంది. ఆ గర్వం ఏమిటో మాత్రం అంతుచిక్కలేదు.

అతను లేచి నించున్నాడు.

రెండు చేతులూ చాచి గుప్పిళ్లు మూశాడు.

"ఈ పిడికిళ్లలో ఈ విశాల భూగోళపు ఆయువుపట్టు చిక్కించుకోవాలి" అన్నాడు.

నేను భరించలేకపోయాను.

"నీ కోసం, నీ ఉద్వేగాలను పంచుకోవటం కోసం ఒక్క స్త్రీని చిక్కించుకోలేకపోయిన ఘనుడివి."

"స్త్రీ! ఈ పరుగులో ఎవరు ఎవరి రహస్యాలను ఎలా చిక్కించుకుంటారో తెలియని వేగంలో ఎన్ని ఆటంకాలు! పెళ్లి కాకముందే నీ రహస్యాలను వెదకజూస్తుంది ఒక స్త్రీ! పెళ్లయాక తెలుసుకున్న రహస్యాలను అమ్మజూస్తుంది మరో స్త్రీ! స్త్రీ ఆటంకం! స్త్రీ ఒక అవసరం! ఒక విజయానికి చిన్న చిన్న త్యాగాలు తప్పవు చినబాబూ!"

"విచారంగా లేదా?"

"కార్యసాధకులకు విచారమా?"

"నీ కోసం నువ్వు ఒక్క ప్రాణి విశ్వాసాన్ని సాధించలేనివాడివి. నువ్వేం కార్యసాధకుడివి?"

"సాధించడాన్ని సాధిస్తాను"

"డబ్బుకోసమే కదా!"

"వ్యాపారస్తులవంటి అల్పులకి ఉత్తేజం డబ్బు, నాక్కాదు"

"మరయితే పేరు కోసమా?"

"రాజకీయ నాయకుల వంటి నీచులకి పేరు"

"ఆ అల్పులే డబ్బునీ, ఆ నీచులే పేరునీ నీకు యిస్తున్నారు. నీకీ సౌకర్యాలూ భద్రతా సమకూరుస్తున్నారు."

"వాళ్లకి ఆ సౌకర్యాలనీ, భద్రతనీ, పేరునీ, ధనాన్నీ యిస్తున్నది నేను. నా పని, నా మేధస్సు, నా శాస్త్రం ఈనాటి వాళ్ల యీ స్థితికి అసలు కారణం."

నివ్వెరపోతూ చూశాను.

"నీ సృష్టివల్ల ఏం నాశనమవబోతున్నదో నీకు తెలుసా?" నీరసంగా అన్నాను.

"చుట్టూ వున్న మనుషులతో ప్రాణులతో సమస్తంతో..." అంటూ ఆగి అతను నవ్వుతూ అన్నాడు 'నేను కూడా'.

అక్కడ నిలవలేకపోయాను. నేను కదులుతూంటే అతని విజ్ఞానమూ ఋషిత్వమూ నా కాళ్లకింద మంటలు పెడుతున్నాయి.

నేనా భవనాల సముదాయపు అంచుకి వచ్చాను. అవి దాటేసరికి సముద్రం ఆహ్వానం పలుకుతోంది. ఎంత అందమైన దృశ్యమది. నేలా సముద్రమూ ఒకదానితో ఒకటి స్నేహపూర్వకంగా సయ్యాటలాడుతున్నాయి. కాలం వెనక్కి తిప్పగలిగితే మనిషికన్నా లక్షల సంవత్సరాల పాత సయ్యాట యిది. మనిషి కన్న పాత జీవులకు ఆలవాలం సముద్రం. నిన్నగాక మొన్న వచ్చిన మనిషికి యీ గోళాన్ని యీ ప్రాణులను యీ సృష్టి చైతన్యాన్ని భస్మీపటలం చేసే హక్కు ఎవరిచ్చారు! ఇంత అనంతకాలానికి ఫుల్‌స్టాప్‌గా నన్ను సృష్టించే శక్తులను ఎదుర్కొనే శక్తులు భూమిమీద లేవా?

నా ప్రశ్నకు సమాధానంగా ఆ మాత్రం దూరంలో ఎవరో ఒక వ్యక్తి సముద్రపు ఒడ్డున కనిపించాడు. అతను నగరానికి దూరంగా ప్రకృతికి దగ్గరగా రాత్రి అందాలను దోసిళ్లతో తాగుతున్నట్లుగా రెండు చేతులనూ కదుపుతున్నాడు. అతని నించి ఏదో రాగం వినవస్తోంది. ఆ రాగం ఒక అనంత వేదనకూ, ఒక అపూర్వ తన్మయత్వానికీ ఏక సంకేతంలా ఉంది. ఆ రాగం ఒక కదలిక నుంచి పుట్టి వ్యాపించి మరెన్నో కదలికలను సృష్టించటానికి పరుగెడుతున్నట్లుంది.

ఆ పాటలో పదాలు పూర్తిగా వినబడటంలేదు. భావం అందటంలేదు. అతని వయిపు

కదిలాను. క్రమంగా భావన అవగతమవుతోంది. గాలి గూర్చి సముద్రం గూర్చి రాత్రి, చుక్కలు, వెన్నెల, స్త్రీలు, మనుషులు గూర్చి... అనేకానేక భావాలతో అతని గొంతూ, పాటా కిక్కిరిసిపోయున్నాయి.

అది అన్నింటినీ ప్రేమిస్తానంటోంది. ప్రేమించమంటోంది. అది ద్వేషాన్ని కరిగిస్తోంది. నన్ను ఆపగలిగే శక్తి అదిగో! ఆ పాటగాడే! ఆ కళాకారుడే! నన్ను భూమిమీద రాలకుండా నిలబెట్టే శక్తి మూర్తీభవించి ఉన్నదదిగో! అక్కడే!

ఉద్వేగంతో అతనిని సమీపించాను.

అతని మొహం చిన్నబోతుందనుకున్నాను. పాట ఆగిపోతుందనుకున్నాను. అతను నన్ను గుర్తించాడు. అతని చూపులలో నేనేదో వెతుకుతున్నాను. అందుకు బదులుగా ఒక నవ్యోత్సాహం కనిపించింది. ఒక ఆహ్వానం కానవచ్చింది.

ఆగిపోయాను అంత దూరాన నిలిచిపోయాను.

నన్ను చూసిన సంభ్రమంలో ఆగిన పాట తిరిగి మొదలయింది. ఆ పాటలో అదే ఉద్వేగం ఉంది. సమస్త ప్రకృతిని చూసి పరవశమైపాడిన గానమే ఆ పరవశత్వమే... నన్ను చూసినా అతను పొందుతున్నాడు. ఆ పాటలో అతను నన్ను సృష్టించిన దేశమనే దాన్ని దేన్నో కీర్తిస్తున్నాడు. అతను సృష్టించుకున్న శతృవులను పదాల శతఘ్నులతో పేల్చేస్తున్నాడు. నేను తన జాతికి గర్వకారణమట!

"ఆపు!" బిగ్గరగా అరిచాను.

ఆగిపోయాడు.

"ఏమిటి నువ్వనే దేశం?" ప్రశ్నించాను.

సరిహద్దులను వివరించబోయాడు. చరిత్రను కదల్చబోయాడు. కొండలతో, నదులతో, నగరాలతో గుర్తింపచేయబోయాడు.

"నిన్ను సరిహద్దుల మధ్య వదిలేస్తాను. ఏ దేశమో చెప్పగలవా! నిన్ను నగరాల్లో అంతస్తుల భవనంలో ఓ గదిలో కూర్చోబెడతాను. ఏ నగరమో వాసన పీల్చి చెప్పగలవా? కొండల మీద పడేస్తాను. అది ఏ కొండో గుర్తించగలవా? నదులలో ముంచుతాను. రుచి చూసి ఏ నదో ఏ దేశమో తెలపగలవా?"

ఆలోచనలో పడ్డాడు.

"నువ్వనే జాతి ఏమిటి?" ప్రశ్నించాను.

అతను ఖండాలను వివరించబోయాడు. బట్టలను, భాషలను, వివాహాలను, వినోదాలను, భావాలను, రాగాలను ఎన్నింటినో కొండగుర్తులు చేసి జాతిని నాకు అవగతం చేయాలని

ప్రయత్నించసాగాడు.

అతనలా తడుముకుంటూంటే? నాకు జాలేసింది.

"ఎందుకు పాడుతున్నావు నువ్వు?"

"నన్ను కదిలించే ప్రతిదీ పాటయి నా నోట పలుకుతుంది."

"నీ పాటనించి నువ్వేం ఆశిస్తున్నావు?"

"నా పాట నా చేతిలో ఉందా? ఆశించటానికి?"

"పోనీ నీ పాటవల్ల ఏం జరుగుతున్నదీ నీకు తెలుసా?"

"ఎలా తెలుస్తుంది? నా చుట్టూ ఉన్న లోకం నన్ను ఆనందపరుస్తుంది, పాడిస్తుంది, బాధిస్తుంది, మళ్లీ పాడిస్తుంది. నా ఆనందం లోకానికి ఆనందం. నా వేదన లోకానికి వేదన, నేను కేవలం వాహికను!"

"నీకు బాధ్యతల్లేవా?"

"దేనిపట్ల?"

"నీకు ఆనందం కలిగించే వాటి భవిష్యత్తు పట్ల"

అతను అసహనంగా చూశాడు. తల అటూ యిటూ తిప్పాడు.

"ఆలోచనలు పాటకి ఉరిత్రాళ్లు" అన్నాడు.

నేను మెల్లగా అక్కడనించి కదిలాను. నా స్థావరం వేపు నడుస్తున్నాను.

"ఆగాగు!"

తృళ్లిపడి ఆగాను.

ఎదురుగా ఓ లేత బుగ్గల చిన్నారిబాబు. ఇసకతో అతని చేతులు నిండివున్నాయి. కళ్ల మీద పడుతున్న జుత్తును ఆ చిన్నారి యిసక చేతుల్తోనే పక్కకి తోసుకుని కోపంగా చూశాడు.

"ఏం కావాలి నీకు?"

"నువ్విలా రాకు!"

"నేనెవరో తెలుసా?"

"ఎవరయితే నాకేం! యింతున్నావు–"

"వస్తే ఏం!"

"నా యిల్లు పాడయిపోతోంది"

అప్పుడు చూశాను.

ఎంతసేపటినించి కడుతున్నాడో ఆ యిసకే యింటిని! అది ఆ బాలుడి సృష్టి! ఆశగా

దానిని చూడాలని కొంచెం కదలబోయాను.

అంతే!

"ఫో..పో.." అంటూ ఆ కుర్రాడు ఏడుపు అందుకున్నాడు. ఆ ఏడుపు నన్ను తరుముతోంది.

నేను పరుగు అందుకున్నాను.

ఆ స్థలం నుంచి, భూమి నుంచి, విశాల విశ్వం నుంచి, బ్రహ్మాండాల నుంచి నన్ను వెంట తరుముతోంది! నన్ను వద్దనే ఆ ఏడుపు.

■

కథా నిలయం
5891
శ్రీకాకుళం

(విపుల మాసపత్రిక, డిసెంబరు 1991)